క్లుప్తంగా

ల్యాప్‌టాప్ అప్పగింత



హసన్‌పర్తి: బస్సులో మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను బాధిత విద్యార్థికి పోలీసులు అప్పగించారు. నగరం శివారులోని ఎస్సార్ కళాశాలకు చెందిన రోహిత్‌కుమార్ నగరంలో బస్సు ఎక్కి అన్నాసాగరం సమీపంలోని ఎస్సార్ కళాశాల స్టేజీ వద్ద దిగి వెళ్లిపోయారు. అయితే, బస్సులోనే ల్యాప్‌టాప్ మరిచి పోయినట్లు గుర్తించి హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం, ల్యాప్‌టాప్‌ను పోలీసులు గుర్తించి సదరు బాధిత విద్యార్థికి అప్పగించారు.

సినిమా వీక్షించిన అనాథలు



హన్మకొండ: హనుమకొండ బాలసముద్రంలోని ఏసియన్ మాల్‌లో హనుమాన్ చిత్రాన్ని వడ్డెపల్లిలోని ఒయాసిస్ అనాథ ఆశ్రమానికి చెందిన పిల్లలు, ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం వీక్షించారు. ఏషియన్ శ్రీదేవి సహకారంతో సులక్ష సేవా సమితి ఆధ్వర్యంలో పిల్లలను సినిమాకు తీసుకెళ్లినట్లు సులక్ష సేవా సమితి అధ్యక్షుడు మండువ సంతోష్ తెలిపారు. కార్యక్రమంలో సులక్ష సభ్యులు కోడం వినయ్, దేవులపల్లి జయంత్, శ్రీనాథ్, నంబూరి సిద్దార్థ, శ్రావణి, వికాస్, ప్రణీత్ పలువురు పాల్గొన్నారు.

మంత్రివర్గంలోకి ముదిరాజ్‌లను తీసుకోవాలి



కాజీపేట: రాష్ట్రంలో త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కు అవకాశం కల్పించి సామాజిక న్యాయం పాటించాలని మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ కోరారు. కాజీపేట పట్టణంలో అమ్మగారి శ్యాం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో దేవేందర్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను మంత్రివర్గంలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం




కాశిబుగ్గ: ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేయడంపై బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కాశిబుగ్గ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ మాట్లాడుతూ బీజేపీతోనే దళితుల అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దండు చక్రపాణి, పోలెపాక జనార్దన్, ఇల్లందుల కిషన్, నర్సింగం, సుదర్శన్, ప్రవీణ్, ఉపేందర్ పాల్గొన్నారు.

కోటను సందర్శించిన మహబూబాబాద్ అదనపు కలెక్టర్



ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ మధ్యకోటను మహబూబాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లెనిన్ కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కాకతీయులు కీర్తితోరణాల నడుమ ఉన్న అద్భుత శిల్ప కళాసంపదతో పాటు ఖుష్‌మహల్, రాతి, మట్టికోట అందాలు, ఏకశిల గుట్ట, శృంగారపు బావిని తిలకించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను వారికి పర్యాటక శాఖ గైడ్ రవియాదవ్ వివరించారు. టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్, కేంద్ర పురావస్తుశాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సందర్శన



కాశిబుగ్గ: 19వ డివిజన్ ఓసిటీలోని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి ఆదివారం సందర్శించారు. కొన్ని వాస్తు మార్పులు చేసిన తర్వాత ఎమ్మెల్యే కొండా సురేఖ దంపతులు క్యాంపు కార్యాలయానికి వస్తారని తెలుస్తోంది. కార్యక్రమంలో మీసాల ప్రకాష్, దాసరి రాజేష్, మహ్మద్ అయూబ్, గోపాల నవీన్‌రాజ్, నల్గొండ రమేష్, గిరిగిరి పుష్ప పాల్గొన్నారు.

జాతి జీవనాన్ని కదిలించిన రామాయణం



ప్రసంగిస్తున్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి



వరంగల్: తోరణాన్ని శుభ్రం చేస్తున్న నాయకులు



కాజీపేట అర్బన్: ఆలయాన్ని శుద్ధి చేస్తున్న భక్తులు

హన్మకొండ కల్చరల్: అనాది కాలం నుంచి భరత జాతి జీవనాన్ని కదిలించింది రామాయణమేనని, సన్మార్గంలో నడిపించింది రామతత్వమని ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు, జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అయోధ్యలో బాలరామమూర్తి ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా వరంగల్ ఏకశిలా వైభవ మండలి ఆధ్వర్యంలో హనుమకొండ ఎన్జీవోస్ కాలనీరోడ్డులోని రెడ్డి మ్యారేజ్‌హాల్‌లో జరుగుతున్న శ్రీమద్రామాయణ సప్తాహం రెండవరోజు ఆదివారం సాయంత్రం వైభవంగా జరిగింది. మండలి బాధ్యులు సౌమిత్రి లక్ష్మణాచార్య, సుధీర్‌కుమార్, కుందావఝుల కృష్ణమూర్తి, ఆచార్య గిరిజామనోహర బాబు పాల్గొన్నారు.

21వ డివిజన్‌లో స్వచ్ఛ తీర్థ

వరంగల్: ఎల్బీనగర్ 21వ డివిజన్‌లోని లక్ష్మీగణపతి దేవాలయాన్ని, స్వాగత తోరణాన్ని ఆదివారం శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, బీజేవైఎం రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ అపురూప రజనీష్‌నేత, అభినయ్, శ్రీకాంత్, మధు, నవీన్, రతన్ పాల్గొన్నారు.

న్యూశాయంపేటలో..

కాజీపేట అర్బన్: స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో భాగంగా 31వ డివిజన్ పరిధిలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేవాలయంలో శుద్ధి చేపట్టారు. కార్యక్రమంలో పెరుగు సురేష్, చంద్రపాల్, శోభన్, శేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యక్ష ప్రసారం

మడికొండ: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా మడికొండ బొడ్రాయి వేదికగా వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు మడికొండ హనుమ భక్త మండలి ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం, సీతారామచంద్రస్వామికి అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం శోభాయాత్ర, రాత్రి 7గంటలకు మడికొండ బొడ్రాయి వద్ద మహా దీపోత్సవం జరపనున్నట్లు వివరించారు.

ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు

కాశిబుగ్గ: అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించేందుకు కాశిబుగ్గలోని అన్ని ఆలయాల్లో ఆయా ఆలయ కమిటీల నిర్వాహకులు ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

అన్నదానానికి సిద్ధం

ఖిలా వరంగల్: శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయంతోపాటు ఫోర్ట్‌రోడ్డు వైకారం జంక్షన్, కరీమాబాద్ రోడ్డు, రంగశాయిపేట, శంభునిపేట, ఖిలా వరంగల్ త్రికోటలో అన్నదానం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలను సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో చెన్నూరు దేవేందర్, అచ్చ వినోద్‌కుమార్, నాగరాజు, పులిచేరి రాజేష్, మాచర్ల రవీందర్ పాల్గొన్నారు.

రామ్‌లల్లా శోభాయాత్ర

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలో రామ్‌లల్లా శోభాయాత్ర వైభవంగా సాగింది. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



కాశిబుగ్గ: ముస్తాబైన కాశిబుగ్గలోని ఆలయం



శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి గుడిలో..



హసన్‌పర్తిలో శోభాయాత్ర

ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి



కాజీపేట: పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కాజీపేట: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టణంలో అభివృద్ధి చేపట్టనున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, నాయకులు సుంచు అశోక్, ఎండీ.అంకూస్, మెరుగు రాజయ్య, బంక సరళ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాజీపేట 61వ డివిజన్ బాబుక్యాంపు కాలనీకి చెందిన పెండ్యాల మౌనికకు రూ.2.50లక్షల ఎల్‌ఓసీ కాపీని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు రమేష్, సాగరిక, రమాకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

కాజీపేట 47వ డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పార్టీలోకి ఆదివారం ఆహ్వానించారు.

పద్మశాలీలకు అండగా ఉంటా..

హన్మకొండ చౌరస్తా: పద్మశాలీల న్యాయమైన సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసి, అండగా ఉంటానని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి భరోసా కల్పించారు. హనుమకొండలోని యాదవనగర్ పెట్రోల్‌బంక్ సమీపంలోని పద్మశాలి భవన్‌లో శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సంక్షేమ పరపతి సంఘం (4వ డివిజన్) సర్వసభ్య సమావేశం, పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. సమావేశంలో పరపతి సంఘం అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు, సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్, కోశాధికారి మహేందర్, ఉపాధ్యక్షులు నరేందర్, రాజేందర్, సత్తయ్య, రాజు, శ్రీధర్, మహేష్‌బాబు పాల్గొన్నారు.

ఇక బీఆర్ఎస్ కారు షెడ్డుకే పరిమితం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: ఇక కారు షెడ్డుకే పరిమితమవుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆరోపించారు. వంగపహాడ్ పీఏసీఎస్ చైర్మన్ మేరుగు రాజేష్‌గౌడ్, వైస్ చైర్మన్ రాజు, మల్లారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ మేడిపల్లి మధన్‌గౌడ్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. సుబేదారిలోని వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వారికి ఎమ్మెల్యే నాగరాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీని కార్యకర్తలు బలోపేతరం చేయాలని, అర్హులైన వారికి పథకాలు అందేలా చూడాలని సూచించారు. రెండవ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగళ్లపల్లి తిరుపతి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు పోలం అనిల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మార్త రవీందర్ పాల్గొన్నారు.

16న దేశవ్యాప్త కార్మిక సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్

వరంగల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలు ఫిబ్రవరి 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ పిలుపునిచ్చారు. ఎల్బీనగర్‌లోని ఇఫ్టూ కార్యాలయంలో కార్మిక సంఘాల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మెకు ముందు ఈనెల 26వ తేదీన వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి పోచమ్మ మైదాన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించాలని, జనవరి 30, 31వ తేదీల్లో యజమాన్యాలకు సమ్మె నోటీసులు ఇవ్వాలని, ఫిబ్రవరి 8న అన్ని కార్మిక సంఘాలతో వరంగల్‌లో సదస్సు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర వీరస్వామి, ఏఐటీయూసీ కార్యదర్శి గన్నారపు రమేష్, కార్మిక సంఘాల నాయకులు పుల్ల రమేష్, రవియాదవ్, ప్రదీప్, జగదీశ్వర్, శ్రీనివాస్, జ్ఞానోదర్, యాకుబ్‌పాషా పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక



హన్మకొండ: ఏకశిల పార్కు వాకర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నికల్లో వంగ రాజిరెడ్డి ప్యానల్ విజయం సాధించింది. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో వాకర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. ఉషారెడ్డి, వంగ రాజిరెడ్డి ప్యానల్‌లు పోటీలో నిలవగా, వంగ రాజిరెడ్డి ప్యానల్ విజయం సాధించింది. అధ్యక్షుడిగా వంగ రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బొద్దిరెడ్డి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పడాల సోమయ్య, సంయుక్త కార్యదర్శిగా బోనాల వీరస్వామి, కోశాధికారిగా సుంచికాల రవీందర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా కుందారపు అరుణ, పట్టంవెట్టి సుమతి విజయం సాధించారు.

కిట్స్ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం

హసన్‌పర్తి: కిట్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా పుల్లా దుర్గారాం, ప్రధాన కార్యదర్శిగా నాగమళ్ల సుధీర్, ఉపాధ్యక్షులుగా చకిలం చంద్రశేఖర్‌రావు, మురాల శంకర్‌రావు, ముఖ్య సలహాదారులుగా పల్లె సంజీవ్, సంయుక్త కార్యదర్శిగా పొన్నోజు శివప్రసాద్, కోశాధికారిగా లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా రవికుమార్, కాలె యాదగిరి, వేల్పుల తిరుపతి, ఎరుకొండ రమేష్ ఎన్నికైనట్లు ఎన్నికల ఇన్‌చార్జ్ పావుశెట్టి వెంకటేశం తెలిపారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

పూర్వ విద్యార్థుల కమిటీ ఎన్నిక

హసన్‌పర్తి: ప్రభుత్వ పాఠశాల 1992 -93వ ఎస్సెస్సీ బ్యాచ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపరాజు కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా జిర్ర రాజు, ప్రధాన కార్యదర్శిగా ఆరెల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా ఆంజనేయ రాజు, ప్రచార కార్యదర్శిగా ఎస్‌టీ.కుమారస్వామి, కోశాధికారిగా శీలం కుమారస్వామి, ఉపకోశాధికారిగా ఎస్.శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా సీహెచ్.కుమారస్వామి, లక్ష్మణకుమార్‌తోపాటు మరో ముగ్గురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఓసిటీ అధ్యక్షుడిగా సాల్లేటి శ్రీధర్‌రెడ్డి

కాశిబుగ్గ: 19వ డివిజన్ ఓసిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులుగా సాల్లేటి శ్రీధర్‌రెడ్డి, దొంతుల శోభన్, తోట కరుణాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓసిటీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనీస్‌సిద్దిఖీ

న్యూశాయంపేట: తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని పోలీస్ కేసులు నమోదుకాని ఉద్యమకారులను అప్పటి పోలీస్ నిఘా వర్గాల రికార్డులను ఆధారంగా గుర్తించాలని, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వరంగల్ శాంతి సంఘం అధ్యక్షుడు డాక్టర్ అనీస్‌సిద్దిఖీ కోరారు. హనుమకొండ ములుగురోడ్డులోని ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌లో ఉద్యమకారుల హనుమకొండ పట్టణ జేఏసీ కన్వీనర్ జీకే.స్వామి అధ్యక్షతన ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కళాకారుడు బుల్లెట్ వెంకన్న మాట్లాడుతూ ఉద్యమంలో ఆటపాటలు, ధూమ్‌ధాంలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేసిన కళాకారులకు గత ప్రభుత్వంలో అన్యాయం జరిగిందని వాపోయారు. జేఏసీ కన్వీనర్ స్వామి మాట్లాడుతూ ఈనెల 27న ఎంసీసీ సెంటర్‌లో నగరంలోని ఉద్యమకారుల సమాలోచన సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో డాక్టర్ రాజ్‌మహ్మద్, సోమరాంమూర్తి, నలిగింటి చంద్రమౌళి, కేడల ప్రసాద్, శరత్, మోతీసింగ్, రహీమున్నీసా బేగం, సాంబయ్య, అబ్దుల్ హఫీజ్, ప్రభాకర్, ఎంఏ.కలీం, సిరాజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల పక్షాన నిలిచిన 'లెనిన్'



లెనిన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: సామ్రాజ్యవాద దోపిడీ ఉన్నంత కాలం పీడిత ప్రజల గుండెల్లో లెనిన్ స్థిరంగా ఉంటారని మానవ హక్కుల వేదిక జిల్లా నేత బండి కోటేశ్వర్‌రావు అన్నారు. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా వరంగల్ ఫోర్ట్‌రోడ్డు జన్మభూమి జంక్షన్‌లో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నేత బాలరాజు ఆధ్వర్యంలో లెనిన్ వర్ధంతి సభ ఆదివారం జరిగింది. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ రష్యాలో పెట్టుబడిదారి దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గ నాయకత్వంలో లెనిన్ పనిచేశారని గుర్తు చేశారు. పెట్టుబడిదారి వ్యవస్థను నిర్మూలించి రష్యాను సోషలిస్టు దేశంగా తీర్చిదిద్దాని కొనియాడారు. కార్యక్రమంలో రాజేందర్, శంకర్, నర్సింగం, రాజలింగం, అక్బర్, హరిబాబు, వీరన్న, కరుణాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆరె' సంఘాన్ని పటిష్టం చేయాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హన్మకొండ: సంఘాన్ని మరింత పటిష్టం చేయాలని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ అధ్యతన హనుమకొండలోని సంఘం భవనంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయి నుంచి సంఘాన్ని పటిష్టం చేయాలని సూచించారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి కమిటీలను పునర్‌నిర్మాణం చేయాలని చెప్పారు. సమావేశంలో సంఘం నాయకులు జెండా రాజేష్, దిగంబర రావు, మోర్తాల చందర్‌రావు, సోమిడి అంజన్‌రావు, నాగుర్ల శంకర్‌రావు, వలిగె సాంబరావు, భలేరావు మనోహర్‌రావు, మోటె చిరంజీవి పాల్గొన్నారు.

గురుధామంలో సీతారాముల కల్యాణం



గురుధామంలో భక్తులకు తాళిబొట్టును చూపిస్తున్న అర్చకులు

వరంగల్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని ములుగురోడ్డు సమీపంలోని గురుధామంలో శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం నిర్వహించారు. నగరంలోని 1,100 జంటలు పాల్గొనగా, ట్రస్ట్ నుంచి వారికి పూజాద్రవ్యాలు, ఇతర సామగ్రిని ఉచితంగా సమకూర్చారు. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచందర్ మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని సీతారాముల కల్యాణం, పట్టాభిషేకం నిర్వహించినట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయి నారాయణ, సోమ రామయ్య, గందె ఉమాశంకర్, మాదారం సదాశివుడు, రేపాల రామచందర్, పబ్బతి నరేష్, తదితరులు ఉన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి



కాజీపేట: పిల్లలు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకుని జీవితంలో రాణించాలని బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా జింగ్రాస్ సూచించారు. ఫాతిమానగర్ బాలవికాస ప్రధాన కార్యాలయంలో 650 మంది అనాథ పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, స్టడీ మెటీరియల్‌ను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలవికాస బోర్డు మెంబర్ రమణ గుప్తా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి, మేనేజర్ లత, లూర్దు మర్రెడ్డి, శోభ, జ్యోతి, సరళ పాల్గొన్నారు.

అలరించిన వేషధారణ పోటీలు



మాట్లాడుతున్న అతిథులు

వరంగల్: అయోధ్యలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నగరంలోని సుశీల్ గార్డెన్స్‌లో మురుగన్ యాడ్స్ ఆధ్వర్యంలో బాలబాలికలకు ఆదివారం వేషధారణ పోటీలు నిర్వహించారు. రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమాన్ వేషధారణలో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆల్ ఇండియా (ఐవీఎఫ్‌ఐ) ప్రధాన కార్యదర్శి గట్టు మహేష్ బాబు, కార్పొరేటర్ గందె కల్పన, కార్యక్రమ నిర్వాహకుడు బొడ్ల రవీంద్రనాథ్, ఐవీఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుల్లూరు మధు, గుముడవెల్లి సురేష్, పి.సత్యనారాయణ, వరంగల్ రామలింగేశ్వర స్వామి, మాజీ ధర్మకర్త గంగిశెట్టి హరినాథ్, అనిల్, అవినాష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

నయీంనగర్: 1967 - 70లో హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ - సైన్స్ కళాశాలలో బీఎస్సీ (బీజెడ్‌సీ) పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం చైతన్య డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ సీహెచ్‌వీ.పురుషోత్తం రెడ్డి కిషన్‌పుర నివాసంలో ఆదివారం జరిగింది. 120 మందిలో 17మంది మృతిచెందగా, మరికొందరు విదేశాల్లో స్థిరపడ్డారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల వారు ఆదివారం ఒకచోటుకు చేరుకుని తమ పాత జ్ఞాపకాలను గుర్తుచేశారు.

సంక్షిప్తంగా

బుకింగ్ కౌంటర్లన్నీ ఓపెన్

కాశిబుగ్గ: వరంగల్ రైల్వేస్టేషన్‌లోని అన్ని బుకింగ్ కౌంటర్లు పనిచేస్తున్నాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ రాకేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మూడు కౌంటర్లు మూసివేత' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో శనివారం వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. స్టేషన్‌లో కౌంటర్లను మూసివేయలేదని, ప్రస్తుతం స్టేషన్‌లోని 5బుకింగ్ కౌంటర్లలో 4 జనరల్, 1 దివ్యాంగుల బుకింగ్ కౌంటర్ ఉందని వివరించారు. స్టేషన్‌లో రైళ్లు లేని సమయంలో కొన్ని కౌంటర్ల మాత్రమే పనిచేస్తాయని చెప్పారు. స్టేషన్‌కు రైళ్లు వచ్చే సమయంలో అన్ని కౌంటర్లను తెరవనున్నట్లు వివరించారు.

వివాహితను రక్షించిన పోలీసులు

హసన్‌పర్తి: కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహితను పోలీసులు రక్షించారు. హసన్‌పర్తి మండలం సిద్ధాపురానికి చెందిన వసంత దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం భర్త జశ్వంత్‌తో గొడవ పడిన వసంత.. ఆత్మహత్య చేసుకునేందుకు సమీపంలోని కత్తెరశాల మల్లన్న స్వామి గుట్టపైకి ఎక్కింది. స్థానికుల సమాచారంతో ఆమెను పోలీసులు రక్షించారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన మడికొండ శివారులో జరిగింది. స్థానికులు తెలపిన వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన ఎదుల రాకేష్, జనగాం అరవింద్ కలిసి ద్విచక్రవాహనంపై ధర్మసాగర్ నుంచి మడికొండ వైపు వెళ్తున్నారు. అలాగే, ఇంకో బైక్‌పై బానోతు యాకూబ్, మల్లేష్ వెళ్తూ మడికొండ శివారులోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద వెనుక నుంచి ముందున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టారు. దాంతో రాకేష్, అరవింద్, బానోతు యాకూబ్‌కు గాయాలు కాగా, స్థానికులు వారిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

ఓయూ విద్యార్థికి పరామర్శ

హసన్‌పర్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉస్మానియా యూనివర్సిటీ తెలంగాణ విద్యార్థి విభాగం నేత పెద్దమ్మ రమేష్‌ను మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. హసన్‌పర్తిలోని రమేష్ ఇంటికి వినోద్‌కుమార్ ఆదివారం వచ్చి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, నాయకులు మురళీకృష్ణ, ఉచిత తిరుపతి, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

ఖిలా వరంగల్: తెలంగాణ సామాజిక వేదిక వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర క్యాలెండర్‌ను హనుమకొండ రాంనగర్‌లోని తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాంబయ్య, కొమ్మినేని భూపాల్‌రావు, భారతి, శంకర్, ఆకోజు పూర్ణచందర్‌రావు, దొడ్డిపాటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి ఉద్యోగుల సంఘం క్యాలెండర్..

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని బీసీ నేత హాస్టల్‌లో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాష్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.